ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గాలికి..!


చినగంట్యాడ వందడుగుల రోడ్‌లో భారీ వాహనాలు


వడ్లపూడి మెయిన్ రోడ్‌లో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

- వీధుల్లో సైతం భారీ వాహనాల హల్‌చల్
- అనధికార పార్కింగ్‌లతో అవస్థలు

గాజువాక:

గాజువాక ప్రాంతంలో ప్రయాణం అంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇష్టానుసారంగా వాహనాలు రాకపోకలు సాగించడంతో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. ఇరుకు వీధుల్లో సైతం పెద్దపెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో జనం ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలు రాకపోకలు సాగించాల్సిన రోడ్లపై భారీ లారీలు, ట్యాంకర్లను రోజుల తరబడి నిలిపి ఉంచుతుండడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. కాలనీల్లో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఉదయం, సాయంత్రం పూట సరదాగా రోడ్లపైకి రావాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు పట్టించుకోకపోతే ప్రమాదాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందుతున్నా సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. భారీ వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తుండడంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వడ్లపూడి రోడ్‌లో భారీ వాహనాల హల్‌చల్

వడ్లపూడి నిర్వాసిత కాలనీ ప్రధాన రహదారిలో భారీ వాహనాలు నిత్యం హడావుడి చేస్తున్నాయి. ఈ కాలనీఆటోనగర్ అనుకొని ఉండడంతో జాతీయ రహదారిపై వచ్చే భారీ లారీలు, ట్రాలర్లు, టారస్ వంటి వాహనాలు ఈ రోడ్‌లో ఆటోనగర్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ఆటోనగర్‌కు రాకపోకలు సాగించే భారీ వాహనాలు శ్రీనగర్ జంక్షన్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అయితే దూరం తగ్గుతుందన్న కారణంతో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వడ్లపూడి ట్రాఫిక్ సిగ్నల్‌వద్ద ట్రాఫిక్ సిబ్బంది ఉంటున్నప్పటికీ కాలనీ లోపల నుంచి వెళ్లే భారీ వాహనాలను మాత్రం పట్టించుకోవడం లేదు. డ్రైవర్లవద్ద మామూళ్లు తీసుకొని వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పార్కింగ్‌లకు అడ్డా

పలు ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, పీహెచ్‌సీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలున్న చినగంట్యాడ వందడుగుల రోడ్డు పూర్తిగా లారీలు, ట్యాంకర్లు, ట్రాలర్ల పార్కింగుతో నిండిపోతోంది. ఉదయం, సాయంత్రం ఆ రోడ్డులో వెళ్లాలంటే ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనన్న ఆందోళనతో జనం భయపడాల్సి వస్తోంది. ఈ రోడ్డులో ఉన్న చినగంట్యాడ శ్మశానం, గాజువాక పీహెచ్‌సీ, గాజువాక తహశీల్దార్ కార్యాలయాలను ఆనుకొని వాహనాలను నిలిపివేస్తున్నారు. అనధికార పార్కింగ్‌లను అనుమతించేది లేదంటూ తమకు అందుతున్న ఫిర్యాదులపై హామీ ఇస్తున్న ట్రాఫిక్ సిబ్బంది మాత్రం వాటిపై చర్య తీసుకోకపోవడంతో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నివాస ప్రాంతాల్లోనూ అదే తీరు

గాజువాకలోని వివిధ నివాస ప్రాంతాల్లోనూ అదే తీరు కొనసాగుతోంది. ఇళ్లను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాల్లో భారీ వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఆటోనగర్‌కు ఆనుకొని ఉన్న విశ్వేశ్వరయ్య ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద లారీలను, ట్యాంకర్లను, ట్రాలర్లను నిలిపివేస్తున్నారు. అందులో ప్రమాదకరమైన వివిధ యాసిడ్ ట్యాంకర్లు కూడా ఉంటున్నట్టు స్థానికులు చెబుతున్నారు. దీంతో నివాసితులు తమ పిల్లలను రోడ్లపైకి పంపాలంటే ఆందోళన చెందుతున్నారు. గాజువాకలోని జాతీయ రహదారిపై శ్రీనగర్, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్లలో భారీ వాహనాలను ఆపుకోవడం కోసం పోలీసులు అనుమతి ఇచ్చారు. వాటిని పూర్తిగా ఆక్రమించడంతోపాటు కాలనీల్లోని ప్రధాన రహదారులు, వీధుల్లో రోడ్లను కూడా లారీ డ్రైవర్లు కొంత వరకు ఆక్రమిస్తుండటంతో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతిరోజు ట్రాఫిక్ స్తంభనే

భారీ వాహనాలతోపాటు వివిధ కంపెనీలకు తమ ఉద్యోగులను తీసుకెళ్లడం కోసం పెద్ద పెద్ద ట్రావెల్ బస్సులు సైతం వీధి రోడ్లలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. అదే సమయంలో పాఠశాలలకు చెందిన ఆటోలు, బస్సులు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కారణంగా ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ సమస్యగా మారింది. ప్రధాన జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ జామ్ అయిపోవడం నిత్యకృత్యమైంది. భారీ వాహనాల పార్కింగ్‌తో ఒకపక్క హైవేతోపాటు మరోపక్క కాలనీల్లో రోడ్లు కూడా పార్కింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడం కోసం కొన్ని నిర్దిష్టమైన సమయల్లో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని జనం కోరుతున్నారు.

ఇదీ సూచన

లంకెలపాలెం నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారిపై భారీ వాహనాలను అనుమతించే విషయంలో సమయాలను నిర్ణయించాలని జనం కోరుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భారీ వాహనాలను నిలుపుదల చేయాలని, సిటీ ట్రావెల్స్ ఎక్కడబడితే అక్కడ ఆపకుండా వాటిని నిలుపుదల చేయడానికి కొన్ని ప్రత్యేక స్టాపులను ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. ఈ విషయంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని సూచిస్తున్నారు. కాగా, నివాస ప్రాంతాల్లో ఉన్న రహదారులపై భారీ వాహనాలను నిలువరించాలని కోరుతున్నారు.


అగనంపూడి వద్ద ట్రాఫిక్

అగనంపూడి టు షీలానగర్

అగనంపూడి నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారి నిత్యం భారీ వాహనాలతో నిండిపోతోంది. నిర్దిష్ట సమయమంటూ లేకుండా నగరంలోకి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. గాజువాక పట్టణ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల కారణంగా అనేకమంది మృత్యువాత పడ్డారు. విశాఖ నగరం నుంచి ఫార్మాసిటీ, బ్రాండిక్స్ తదితర కంపెనీలకు సుమారు 220 ట్రావెల్ బస్సులు తిరుగుతున్నట్టు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్న వేలాది మంది పిల్లలు ఈ భారీ వాహనాల కారణంగా అవస్థలను ఎదుర్కొంటున్నారు. పాఠశాల సమయాల్లో సైతం భారీ వాహనాలు పట్టణంలో రాకపోకలు సాగిస్తుండటంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు.దీంతో అగనంపూడి నుంచి షీలానగర్ వరకు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు 86, 87 వార్డులకు నీటి సరఫరా నిలిపివేత

కూర్మన్నపాలెం: వాటర్‌పైప్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా గురువారం జీవీఎంసీ 86,87 వార్డుల పరిధిలోని వడ్లపూడిలోని వివిధ ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిచిపోనుంది. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సిద్ధార్థనగర్ పంప్ హౌస్‌లో మంచినీటి మోటర్లు అమర్చడం, వాల్వు బిగించడంతో పాటు పైపులైన్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అందువల్ల నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్టాపన మహోత్సవాలు


సిద్ధమైన రామాలయం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఈ నెల 11న విగ్రహ ప్రతిష్ఠ, అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నిర్వాసిత కాలనీల ప్రజలు కార్యక్రమాలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: సూపర్ జీఎస్‌టీ 2.0పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వివేకానంద అన్నారు. సూపర్ జీఎస్టీ 2.0పై కళాశాల విద్యార్థులతో బుధవారం 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన శైలజ, దీపిక, ఫాతిమాబేగంకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైక్ సెట్ వితరణ


నూకాంబిక ఆలయానికి మైక్‌సెట్ అందిస్తున్న బలిరెడ్డి నాగేశ్వరరావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు దానబోయినపాలెం నిర్వాసితకాలనీలోని నూకాంబిక ఆలయానికి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు మైక్ సెట్ అందించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంలో దానబోయినపాలెం గ్రామస్తులు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సర్వహితా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, దానబాల పెద సన్యాసిరావు, మైడిశెట్టి పైడయ్య, అమరపిని అప్పారావు, జి.వి.ఎస్. నారాయణ, ఎల్. నారాయణ పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

జగన్ పర్యటనను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: పేద ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్యం అందాలని పోరాటం చేస్తున్న మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పలదేవన్ రెడ్డి, గాజువాక పరిశీలకుడు తైనాల విజయకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పెదగంట్యాడ పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నర్సీపట్నంలో నిర్మించిన వైద్య కళాశాల పరిశీలనకు గురువారం విచ్చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలకడానికి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ధర్మాల శ్రీనివాసరావు, గొందేశి శ్రీనివాసరెడ్డి, మంత్రి శంకరనారాయణ, బొడ్డ గోవింద్, సాకత్ ఆలీ, గుడివాడ లతీష్, నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చిన తల్లి, గొందేశి వెంకటరమణారెడ్డి, బిత్రాడ వెంకటరమణ, ఎన్నేటి రమణ, రోజారాణి, బోగాది సన్ని, రావాడ శివ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నేత విరాళం


విరాళం అందజేస్తున్న బొడ్డ గోవింద్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి నిర్వాసిత కాలనీ రామాలయం వద్ద చేపట్టిన పంచముఖేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డ గోవింద్, దివ్యభారతి దంపతులు రూ.1,00,159 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రగడ శ్రీనివాసరావు, దుగ్గపు దానప్పలు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ గోవిందరాజులు, ప్రగడ శంకరరావు, పూడి శ్రీనివాస్, కొన్నా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు మంజూరు చేయవద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వుడానగర్ వాసులు

కూర్మన్నపాలెం: అంబూజీ సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు మంజూరు చేయవద్దని కోరుతూ 86వ వార్డు వుడానగర్ ఫేజ్–1 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు వినతిపత్రం అందజేశారు.సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే గాజువాక ప్రాంతం దుమ్ము ధూళితో నిండిపోయి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని అసోసియేషన్ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు వివరించారు. ఇప్పటికే వివిధ పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమ ఏర్పాటు అయితే ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు కాలనీపెద్దలు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండిస్తూ నిరసన


నిరసన తెలుపుతున్న దళితసంఘాల నేతలు

కూర్మన్నపాలెం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. గవాయ్‌పై దాడిని నిరసిస్తూ దళిత సంఘాల నాయకులు బుధవారం కూర్మన్నపాలెంలో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు దళితనేతలు పాల్గొని న్యాయమూర్తిపై దాడిని ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై బూటు విసిరిన న్యాయవాదిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దళితుడు ఉన్నత పదవుల్లో ఉండడం సహించలేకే ఇటువంటి దారుణాలకు ఒడిగడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాలనాయకులు అంబేడ్కర్, మాటూరి శ్రీనివాసరావు, బి.వెంకటరావు, బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కుల పరిరక్షణ


బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ఉద్యోగులను ఐక్యపరిచి ఉద్యమాలు చేయడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని బ్యాక్‌వర్డ్ అండ్ మైనార్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బామ్‌సెఫ్) రాష్ట్ర నాయకుడు కొల్లాబత్తుల సత్యం పిలుపునిచ్చారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ హాలులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ స్టీల్‌ప్లాంట్‌తో ఇతర ప్రాంతాల ఉద్యోగులు తీర్మానాలు చేశారన్నారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ బామ్‌సెఫ్ బలోపేతం చర్యల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈపీడీసీఎల్ ప్రతినిధి భీమశంకర్, విజయనగరం బామ్‌సెఫ్ కన్వీనర్ పి. రామారావు, జోనల్ కన్వీనర్ శివప్రసాద్ మాట్లాడుతూ బీఎస్పీ బలోపేతం అయితే స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి మరింత బలం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైజాగ్ బామ్‌సెఫ్ కన్వీనర్ ఎల్.వి. రమణ, కె.వి. రమణ, మొగలేశ్వరన్, శ్రీనివాసరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ నూతన ఏడీఆర్‌ఎంగా రామారావు



తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ నూతన అడిషనల్ డివిజినల్ రైల్వే మేనేజర్‌గా కుందు రామారావు నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా, పలాసకు చెందిన ఆయన 2002లో ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసారు. ప్రజాసేవపై గల ఆసక్తితో 2006లో ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష రాసి, ఆలిండియా 44వ ర్యాంకు సాధించి రైల్వేలో చేరారు. పలు జోన్లలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్‌గా, సీనియర్ డివిజినల్ ఇంజినీర్‌గా, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. జపాన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో కూడా ఈయన పాల్గొన్నారు. తన సేవలకు గాను ప్రతిష్టాత్మక జనరల్ మేనేజర్ అవార్డును 2010లో పొందుకున్నారు.

జానపద కళలను కాపాడుకుందాం


గంగులయ్యను సత్కరిస్తున్న గ్యాస్ డెలివరీ సంఘం ప్రతినిధులు

అగనంపూడి: రాష్ట్రంలో జానపద కళలు అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడుకుందామని రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య అన్నారు. గంగులయ్యను అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం విశాఖ జిల్లా గ్యాస్ ఏజెన్సీ డెలివరీ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళలు, పౌరాణిక నాటకాలకు ఆదరణ లేకపోవడంతో కళాకారులు కనుమరుగవుతున్నారన్నారు. జానపదంలో ఉన్న సాహిత్యం ప్రజలను ఉత్తేజపరుస్తుందని, పల్లె నాగరికతను కళ్లకు కడుతుందన్నారు. అటువంటి కళలను బతికించుకోడానికి కలసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డెలివరీ బాయ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోన గోవింద్, అసోసియేషన్ ప్రతినిధులు పెద్దింటి వేణు, నగేందర్‌రెడ్డి, సన్యాసిరావు, అప్పారావు, రమణ పాల్గొన్నారు.

జూలో ముగిసిన వన్యప్రాణి వారోత్సవాలు


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాలు బుధవారం ముగిశాయి. పిల్లలు పలు రకాల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జూలో వారోత్సవాలు ఈ నెల 2న ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రారంభం నుంచి పాఠశాల, కళాశాలలతోపాటు వివిధ వయసుల వారికి జూ అధికారులు పోటీలు నిర్వహించారు. వన్యప్రాణులు, పర్యావరణం, తదితర అంశాలపై వక్తృత్వం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి అధికారులు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్, సహాయ అటవీ జనరల్ ఇన్‌స్పెక్టర్ కె.బాలాజీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటిని సంరక్షించి మానవులు, ప్రకృతి మధ్య సామరస్యాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జూ క్యూరేటర్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలతోనే ఉన్నత స్థానం


ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేవీ రమణ

మురళీనగర్ : పాలిటెక్నిక్ కెమికల్ డిప్లమా విద్యార్థులు సబ్జెక్టులో పట్టు సాధించడంతోపాటు జీవన నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారానే ఉన్నత స్థానానికి చేరుకోగలరని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ తెలిపారు. గైస్ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉన్నత ఫౌండేషన్ నిర్వహించిన నైపుణ్య శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమాచార నైపుణ్యాలు, ఆంగ్ల భాషలో మాట్లాడడం, జీవన నైపుణ్యాలను పెంచుకోవడం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. స్వీయ నిర్వహణ, బృంద సభ్యులతో సమన్వయం చేసుకుని పని చేయడం ద్వారా ఉద్యోగాల్లో రాణించగలరని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో పెట్రో కెమికల్స్ హెడ్ సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, సీనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

బీచ్‌రోడ్డు : ప్రతీ సంవత్సరం అత్యంత వైభవంగా జరుపుకునే రాధాకృష్ణ మహోత్సవాలు ఈ ఏడాది నవంబర్ 5న నిర్వహించనున్నామని యాదవ సంఘ గౌరవ అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం సంపత్ వినాయక దేవాలయం వద్ద విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి రాధాకృష్ణ మహోత్సవాల (పాలు పెరుగు యదుమేళా) పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ రోడ్డు గోకుల్ పార్కు వద్ద నిర్వహించే మహోత్సవాలు యాదవ సమాజంలో ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణ, భక్తి భావాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షుడు బరినకాన రామారావు, విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో అమృత్ సంవాద్


ప్రయాణికురాలికి కానుక అందజేస్తున్న రైల్వే అధికారి పవన్‌కుమార్

తాటిచెట్లపాలెం: ప్రత్యేక క్యాంపెయిన్-5లో భాగంగా ప్రయాణికుల భాగస్వామ్యంతో కూడిన అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించారు. జనరల్ స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాళ్ల వద్ద వాల్తేర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ ప్రయాణికులతో ముచ్చటించారు. వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. రైల్వే అధికారులు, ప్రయాణికుల ప్రత్యక్ష సమాచార ప్రక్రియలో భాగమే అమృత్‌సంవాద్. ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా రైల్వే అధికారులు స్వయంగా ప్రయాణికుల సూచనలు స్వీకరిస్తున్నారు. విశాఖరైల్వే స్టేషన్‌లో బుధవారం జరిగిన అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు కొన్ని సూచనలు చేశారు. ఎస్కలేటర్స్ దగ్గర కచ్చితంగా సహాయకులను నియమించాలని, వారు లేకపోవడంతో సీనియర్ సిటిజన్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే స్లీపర్‌క్లాస్ కోచ్‌లలో రైల్వేనే భోజనం ఏర్పాటు చేయడం మంచిదని పలువురు తెలిపారు. వీరికి సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ చిరు కానుకలు అందజేశారు.